RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | శనివారం 13-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 257 పేజీలు: 4 | వెల: 5/- | ఎడిటర్: సంటీప్ గౌడ్ వి



## మీనాక్షి పిటిషన్ కొట్టివేత

**రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ కేసులో సుప్రీంకోర్టులో చుక్కెదురు**

**ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోబోమన్న ద్విసభ్య ధర్మాసనం**

**ప్రక్రియ పూర్తయ్యాక ఎన్నికల పిటిషన్‌దాఖలు చేసుకోవచ్చని సూచన**

న్యూఢిల్లీ, జూన్ 12: మధ్యప్రదేశ్ నుంచి తన రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించడాన్ని సవా లు చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షీ నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియలో కోర్టులు జోక్యం చేసుకోలేవని, ఎన్నికల పిటిషన్ దాఖలే ఇందుకు సరై న పరిష్కారం చూపగలదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల నిర్వహణ సమయంలో న్యాయ జోక్యాన్ని చట్టపరమైన నిబంధనలు నిషేధిస్తున్నాయని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. ఈ దశలో కోర్టు అధికార పరిధిని వినియోగించుకోవాలన్న మీనాక్షి ప్రయత్నా న్ని సుప్రీంకోర్టు తిరస్కరించింది. అసంపూర్ణమైన ఫారమ్ 26 అఫిడవిట్‌ను దాఖలు చేయ డం, తనపై పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదు కేసు వివరాలు వెల్లడించకపోవడం అనే కారణాలతో రిటర్నింగ్ అధికారి మీనాక్షి

2లో

## కిమ్ బాటలో కాషాయ పార్టీ

**ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**ఆయన్ను రోల్‌మోడల్‌గా తీసుకునే బీజేపీ ఓటు చోరీ--సీటు చోరీలకు పాల్పడుతోంది**

**మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ముమ్మాటికీ ఆ పార్టీ కుట్రే**

**బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్, రిటర్నింగ్ అధికారే కుట్రదారులు**

**ప్రధాని మోదీకి వచ్చే నోటీసులన్నింటినీ అఫిడవిట్‌లో చెబుతున్నారా?**

**నిధుల కేటాయింపులో వివక్ష పోవాలంటే వచ్చే ఎన్నికల్లో ప్రధానిని మారిస్తే సరిపోతుంది**

**కిషన్‌రెడ్డితో పాటు బీజేపీ ఎంపీలు రాజీనామా చేస్తే తెలంగాణకు ప్రాజెక్టులు వస్తాయి**

**ఎవరైనా తెలంగాణ ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడితేనే సమస్యలొస్తాయన్న సీఎం**

2లో

న్యూఢిల్లీ: ఉత్తర కొరియా నియంత కిమ్ జాంగ్ ఉన్ బాటలోనే బీజేపీ పయనిస్తోందని, ఆయన్ను రోల్‌మోడల్‌గా తీసుకునే ఓటు చోరీ--సీటు చోరీలకు పాల్పడుతోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విమర్శించారు. మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా పోటీ చేసిన మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి క్రిమినల్ కేసులు లేకున్నా, ఊహాజనిత కేసును చూపెట్టి ఆమె నామినేషన్ పత్రాన్ని తిరస్కరించడం ముమ్మాటికీ బీజేపీ కుట్రేనని అన్నారు. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్, స్థానిక రిటర్నింగ్ ఆఫీసర్లే కుట్రదారులని ఆరోపించారు. ప్రైవేటు ఫిర్యాదులపై ఇచ్చే





## అది ఇరాన్ ఘాతుకమే

**భారతీయులున్న నౌకలపై ఇరాన్ సైన్యమే డ్రోన్లు ప్రయోగించింది**

**ఇలాంటి చర్యలు ఎంతమాత్రం అంగీకారయోగ్యం కాదు**

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టీకరణ**

**అమెరికా దాడి చేసినట్లు భారత్ ప్రకటన**

**భారత్‌లోని అమెరికా దౌత్యవేత్త జాసన్ మీక్స్‌కు మళ్లీ సమన్లు**

వాషింగ్టన్: ఒమన్ తీరం సమీపంలో భారతీయ సిబ్బంది ఉన్న నౌకలపై దాడి చేసింది తాము కాదని.. అది ముమ్మాటికీ ఇరాన్ ఘాతుకమేనని అమె రికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం తేల్చిచెప్పారు. హోర్ముజ్ జలసంధి నుంచి బయలుదేరిన నౌకలపై ఇరాన్ సైన్యం డ్రోన్లు ప్రయోగించిందని ఆరోపించారు. ఇలాంటి చర్యలు ఎంతమాత్రం అంగీకారయోగ్యం కాదని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టుచేశారు. అలాగే శాంతి ఒప్పందంలోని పలు అంశాలను మీడియాకు ఇరాన్

NATIONAL TESTING AGENCY (NTA)

## నీట్ పరీక్షా సమయం పెంపు!

**అదనంగా 15 నిమిషాలు పెంచిన ఎన్‌టీఏ**

**మధ్యాహ్నం 2 నుంచి 5.15 గంటల వరకు పరీక్ష**

**నాలుగుకు పెరగనున్న రఫ్ వర్క్ పేజీలు**

**ఎడమ చేతివాటం విద్యార్థులకు అనుకూలంగా బుక్‌లెట్ డిజైన్**

**జూన్ 21న జరగనున్న నీట్ రీ--ఎగ్జామ్‌కు పక్కాగా ఏర్పాట్లు**

2లో


## ఎల్‌నినో ప్రభావం మొదలైంది..!

**పసిఫిక్ మహాసముద్రంపై ఎల్‌నినో పరిస్థితులు ప్రారంభం**

**భారత వాతావరణ శాఖ ధ్రువీకరణ**

**వచ్చే నెలలో సానుకూల ఐఓడీ ఏర్పడితే తగ్గనున్న ప్రభావం**

న్యూఢిల్లీ: ఎల్‌నినో ముప్పు ప్రపంచ దేశాలను బెంబేలెత్తిస్తోంది. పసిఫిక్ మహాసముద్రంపై ఎల్‌నినో పరిస్థితులు ప్రారంభమైనట్లు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అధికారికంగా ధ్రువీకరించింది.





## ఆర్నెల్ల కూతురితో కలిసి.. ఆరో అంతస్తు నుంచి దూకి

**మృతి చెందిన తల్లి...ఇనుప కంచెకు డ్రెస్ చిక్కుకొని ప్రాణాలతో బయటపడిన చిన్నారి**

**మియాపూర్ మయూరీనగర్‌లో ఘటన**

మియాపూర్: ఆరు నెలల చిన్నారితో కలిసి ఓ సాఫ్ట్‌వేర్ మహిళ తాను నివాసముంటున్న అపార్ట్‌మెంట్ ఆరవ అంతస్తుపై నుంచి కిందికి దూకింది. తీవ్ర గాయాలతో

2లో

## మీనాక్షి రాజ్యసభ నామినేషన్ వివాదంపై సిట్ విచారణ జరిపించండి: కేటీఆర్ ఎద్దేవా

**ప్రతి అంశానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందన్న కేటీఆర్**

**మీనాక్షికి వ్యతిరేకంగా కొందరు కాంగ్రెస్ నేతలు వ్యవహరించి ఉండొచ్చని వ్యాఖ్య**

**పార్టీ ద్రోహులను రాహుల్ గాంధీ గుర్తించాలని సూచన**

# పెట్టుబడులు పెట్టండి




**పెత్తందార్లం కాదు.. ప్రజా సేవకులం**

**రైతులకు లింక్ ప్రొడక్ట్స్ అంటగట్టడం శిక్షార్హం**

**మత్తిచ్చి.. ఊపిరాడకుండా చేసి..!**

**కార్మికుల శ్రమతోనే రాష్ట్రాభివృద్ధి**

**గ్రీన్ ఎనర్జీ క్యాపిటల్‌గా ఏపీ**

**ప్రభుత్వ పాఠశాలలతో లాభాలెన్నో..!**

**నోటిఫికేషన్లపై వదంతులు నమ్మొద్దు: ఏపీపీఎస్సీ**

**ఉత్తమ టీచర్లకు అంతర్జాతీయ శిక్షణ**

**వీబీజీరామ్‌జీపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు**

**జనగణనకు 112 కోట్లు విడుదల**

తిరుపతి: రాష్ట్రానికి తాము పెత్తందారులం కాదని, ప్రజా సేవకులమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కూటమి పాలన రెండేళ్ల విజయోత్సవంతో ప్రజాసేవకు పునరంకితమవుతున్నామని భావోద్వేగంతో ప్రకటించారు. శుక్రవారం మధ్యాహ్నం తిరుపతి నగర శివారులో దామినేడు సమీపంలో 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరిట నిర్వహించిన బహిరంగ సభను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి లోకేశ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం భారీ సంఖ్యలో హాజరైన కూటమి పార్టీల శ్రేణులను, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో నిర్ణయాలు తీసుకుంటుంటే.. గొడ్డలి పార్టీ లేనిపోని దుష్ప్రచారాలు చేస్తోందని ఆరోపించారు. వైసీపీ నేతలకు అభివృద్ధిపరంగా ఒక లక్ష్యం, విజన్ అంటూ ఏదీ లేదని.. వారికున్నదల్లా విషపూరిత మనస్తత్వమేనని ధ్వజమెత్తారు.మద్యనిషేధం అమలు చేశాకే ఓట్లు అడుగుతానన్న వ్యక్తి



## విద్యుత్ చార్జీలపై కీలక ప్రకటన చేసిన ఏపీ మంత్రి గొట్టిపాటి

**జగన్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థలో సృష్టించిన విధ్వంసాన్ని సరిదిద్దామన్న గొట్టిపాటి**

**రాబోయే మూడేళ్లలో కూడా విద్యుత్ ఛార్జీలను పెంచబోమని స్పష్టీకరణ**

మిగతా 2లో

## రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

**ఇతర రాష్ట్రాల్లోలాగే తెలంగాణలోనూ కాంగ్రెస్ ఖతం**

**కాంగ్రెస్ పార్టీకి ఈసారి డిపాజిట్లు కూడా దక్కవు**

**సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జోస్యం**

కరీంనగర్: రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే,

# కిమ్ బాటలో కాషాయ పార్టీ

నోటీసులన్నింటినీ ప్రధాని నరేంద్ర మోదీ తన ఎన్నికల అఫిడవిట్‌లో చూపెడుతున్నారా? అని ప్రశ్నించారు. నీతిఆయోగ్ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన రేవంత్‌రెడ్డి శుక్రవారం మీడియాతో పలు అంశాలపై చిట్‌చాట్ చేశారు. 'ఇన్నాళ్లు బీజేపీకి గాడ్సే ఆదర్శం అనుకున్నాం. గాంధేయవాదులకీ, గాడ్సే వారసులకీ యుద్ధం జరుగుతోందని భావించాం. కానీ బీజేపీ ఇప్పుడు కిమ్ జాంగ్‌ను ఆదర్శంగా తీసుకుంటోంది. ఉత్తర కొరియాలో ఎన్నికల్లో ఒకే పార్టీ పోటీ చేస్తుంది. ఓట్లన్నీ ఆ పార్టీ నేత కిమ్ జాంగ్‌కే పడతాయి. ఆయనే అధ్యక్షునిగా ఎన్నిక అవుతారు. అదే మాదిరి బీజేపీ ఓట్లు, సీట్లు అన్నీ తమకే దక్కేలా కుట్రలు చేస్తోంది. మీనాక్షి విషయంలోనూ అదే చేసి చూపించింది. మధ్యప్రదేశ్ ఎన్నికల్లో తగినంత సంఖ్యాబలం లేకుండా మూడో అభ్యర్థిని పోటీలో పెట్టడం వెనుకే పెద్ద కుట్ర ఉంది. అక్కడ బీజేపీకి గెలిచేంత బలమే లేదు. అయినా అభ్యర్థిని పోటీలో పెట్టారు. మీనాక్షి నామినేషన్ వేశాక కుట్రలకు తెరలేపారు. వాస్తవానికి ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు కాలేదు. తెలంగాణలో ఆమెపై ఎలాంటి కేసులు లేవు. ఓ ప్రైవేటు ఫిర్యాదుకు సంబంధించిన విషయంలో ఆమెకు సమన్లు మాత్రమే జారీ అయ్యాయి. 2023లో ఇద్దరి మధ్యలో జరిగిన వివాదంతో మీనాక్షికి సంబంధం లేదు. అయినప్పటికీ రిటర్నింగ్ ఆఫీసర్ ఒక పార్టీకి కార్యకర్తలా వ్యవహరించి నామినేషన్ తిరస్కరించారు. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్, రిటర్నింగ్ ఆఫీసర్ ఇద్దరూ కుట్రదారులే. బీజేపీ టాప్ నేతలే దీనికి వ్యూహరచన చేశారు. కేసే లేనప్పుడు తెలంగాణ నుంచి ఈ వివరాలు ఎవరు బీజేపీ నేతలకు అందించారన్న దానిపై ప్రత్యేకంగా విచారణ అక్కర్లేదు..'అని సీఎం అన్నారు. తెలంగాణకు ప్రాజెక్టులు ఇవ్వొద్దని కిషన్‌రెడ్డి ప్రతి కేంద్రమంత్రినీ కలిసి చెబుతున్నారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు తానే నిలిపివేయించానని బీఆర్ఎస్ మాజీమంత్రి కేటీఆర్ అంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లుగా కిషన్‌రెడ్డి ఆడుతున్నారు. ఐఆర్ఎఫ్‌సీకి లోన్ ఎందుకు ఇవ్వడంలేదు? 30వ తేదీన రావాల్సిన ఆ డబ్బులు ఎందుకు ఇవ్వడంలేదు? ఆర్ఆర్ఆర్ లో 320 కిలోమీటర్ల టెండర్ల ప్రక్రియ ఎందుకు ఆలస్యం అవుతోంది? మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వమే ఉంది. కిషన్‌రెడ్డి కేంద్రమంత్రిగా సీఎం ఫడ్నవీస్‌తో మాట్లాడి 1,500 ఎకరాలు తెలంగాణకు ఇప్పించలేరా? రాష్ట్ర ప్రాజెక్టులకు నిధులపై ప్రధానికి కిషన్‌రెడ్డి ఎన్ని లేఖలు రాశారో చెప్పాలి.

**కేబినెట్ భేటీకి రానని చెప్పాలి..**

మేము అడుగుతున్న మెట్రో, మూసీ ప్రక్షాళన ప్రాజెక్టులు కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోనే ఉన్నాయి. వీటిపై ఆయన ప్రధాని మోదీని కేబినెట్‌లో ఎందుకు అడగడం లేదు? ఈ సమస్యలన్నీ పరిష్కరించే వరకు మంత్రివర్గ సమావేశానికి హాజరుకానని కిషన్‌రెడ్డి చెప్పాలి. లేదంటే కిషన్‌రెడ్డి సహా..రాష్ట్రానికి చెందిన మొత్తం 8మంది ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేస్తే తెలంగాణ ప్రాజెక్టులు పరిగెత్తుకుంటూ వస్తాయి. మెట్రో వస్తే మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు పేరు వస్తుందని కిషన్‌రెడ్డి ఆపుతున్నారు..'అని రేవంత్ ఆరోపించారు. 'బీజేపీయేతర పాలిత రాష్ట్రాలకు నిధుల కేటాయింపు విషయంలో వివక్ష ఉంది. ఈ వివక్ష పోవాలంటే వచ్చే ఎన్నికల్లో ప్రధానిని మారిస్తే సరిపోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే దేశం ముందుకెళుతుంది. రాష్ట్రం కోరుతున్న ట్రిపుల్ ఆర్, రీజనల్ రింగ్‌రోడ్డు, ఐఐఎం, మెట్రోలకు ఇప్పటికైనా కేంద్రం నిధులచ్చి సహకరించాలి.

## రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

మాజీ మంత్రి టి.హరీశ్ రావు హెచ్చరించారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారం కోల్పోయాయని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అదే జరగబోతోందని అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలనపై మరోసారి నిప్పులు చెరిగారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. . సీఎం రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదని వంద కోట్ల రూపాయిలతో ఇంకో ప్యాలస్ నిర్మించారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో దిగడానికి హెలికాప్టర్ చాలదని ఐదు కోట్ల రూపాయిలతో ఎయిర్ బస్ తెచ్చుకుంటున్నారని మండిపడ్డారు. ఫుట్ బాల్ సోకుల కోసం మెస్సీకి రూ.100 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. అందాల పోటీల కోసం మరో రూ.100 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి మూటలు పంపటానికి నగదు ఉంటుందని, కానీ విద్యార్థులు, రైతులకు ఇవ్వటానికి మాత్రం డబ్బులు ఉండవా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు చురకలంటించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపి రైతుబంధు నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని.. ఇప్పుడు సీఎం రేవంత్‌కు ఏమైందని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాది రైతుబంధు పూర్తిగా ఎగ్గొట్టారు. రెండోసారి మూడు ఎకరాలకు, మూడోసారి రెండెకరాలకే ఇచ్చారు. మొత్తం రూ.20వేల కోట్లు ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని చెబుతున్నారు. కేసీఆర్ క్రమం తప్పకుండా రైతుబంధు ఇచ్చారు. 45 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు గతంలో సిద్దిపేటలో సీఎం రేవంత్ ప్రకటించారు. 65 రోజులు పూర్తయినా ఇంకా పడలేదు. దేశవ్యాప్తంగా ప్రశంసలందుకున్న రైతు బీమా పథకం కూడా బంద్ అయింది. ఎల్ఐసీకి ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో ఆ పథకం నిలిచిపోయింది. రైతు చనిపోతే ఆ కుటుంబానికి అందాల్సిన బీమా కూడా రావడం లేదు. ఎరువులకూ ఇబ్బందులు తప్పడం లేదు. వడ్లు, మక్కలు విక్రయానికి రైతులు పడిగాపులు కాశారు. సంచులు చెదలు పట్టినా వడ్లు కొనే పరిస్థితి లేకుండా పోయింది.

## విద్యుత్ చార్జీలపై కీలక ప్రకటన చేసిన ఏపీ మంత్రి గొట్టిపాటి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రంగా దెబ్బతిన్న విద్యుత్ రంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విజయవంతంగా పునరుద్ధరించిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థలో సృష్టించిన విధ్వంసాన్ని కేవలం రెండేళ్లలోనే సరిదిద్ది, పట్టాలెక్కించామని పేర్కొన్నారు. గత రెండేళ్లలో విద్యుత్ ఛార్జీలను ఒక్క రూపాయి కూడా పెంచలేదని... రాబోయే మూడేళ్లలో కూడా విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం వినియోగదారులపై అదనపు భారం మోపిన 'ట్రూ అప్' విధానానికి స్వస్తి పలికి, చరిత్రలోనే మొదటిసారిగా 'ట్రూ డౌన్' విధానాన్ని తీసుకువచ్చామని తెలిపారు. దీని ద్వారా యూనిట్‌కు 13 పైసల చొప్పున ఛార్జీలను తగ్గించి, ప్రజలకు రూ. 4,498 కోట్ల మేర ఉపశమనం కలిగించామని వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల కాలంలో ఏకంగా తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందని మంత్రి ధ్వజమెత్తారు. సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు 6 లక్షల ఉచిత సోలార్ కనెక్షన్లను అందించడానికి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదనను గణనీయంగా పెంచడం ద్వారా, బయటి రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసే ఖరీదైన విద్యుత్ భారాన్ని తగ్గించామన్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా 160 గిగావాట్ల విద్యుత్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని, విద్యుత్ నష్టాలను తగ్గించేందుకు పెద్ద సంఖ్యలో కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు.

## ఆర్నెల్ల కూతురితో కలిసి.. ఆరో అంతస్తు నుంచి దూకి

ఆమె అక్కడికక్కడే మృతి చెందగా ప్రహరీ గోడపై ఉన్న ఇనుప కంచెకు డ్రెస్ చిక్కుకొని గాయాలతో చిన్నారి బయటపడింది. ఈ ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన భూపేంద్ర సాహు, మధ్యప్రదేశ్‌లోని భూత్‌గావ్‌కు చెందిన ఈషా సాహు (37)లకు 2015లో వివాహం జరిగింది. గత ఎనిమిదేళ్లుగా వీరు మియాపూర్ మయూరీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తులో ఉంటున్నారు. వీరిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్ద కూతురుకు ఎనిమిదేళ్లు, మరో చిన్నారికి ఆరు నెలలు. ప్రస్తుతం ఈషా సాహు ప్రసూతి సెలవులో ఉంది. కొన్ని నెలలుగా ఈషా సాహు తల్లిదండ్రుల ఊళ్లోనే ఉంది. నెల రోజుల క్రితం నాగపూర్‌లోని అత్తారింటికి వెళ్లింది. పెద్ద కూతురుకు స్కూళ్లు ప్రారంభం కావడంతో గత నెల 30న ఆమె తన భర్త, పిల్లలతో కలిసి నగరానికి వచ్చింది. కాగా, శుక్రవారం మధ్యాహ్నం ఈషా సాహు తన భర్త భూపేంద్ర సాహు, పెద్ద కూతురు విధిని సరుకులు తీసుకురావాలని చెప్పి డీమార్ట్‌కు పంపించింది. సాయంత్రం సమయంలో ఆరు నెలల కూతురు వాణితో కలిసి ఆమె ఓ బకెట్ తీసుకొని ఆరవ ఫ్లోర్‌కు వెళ్లింది. బకెట్ పైకి ఎక్కి గోడ మీద నుంచి చిన్నారితో కలిసి ఆమె కిందికి దూకింది. తీవ్ర గాయాలతో ఈషా సాహు అక్కడికక్కడే మృతి చెందగా అపార్ట్‌మెంట్ ప్రహరీగోడపై ఉన్న ఇనుప కంచెకు చిన్నారి డ్రెస్ చిక్కుకొని స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి భర్త భూపేంద్ర సాహు, మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా ఈషా సాహు మృతి చెందగా, పక్కనే ఉన్న ప్రహరీగోడ ఇనుప కంచెకు గౌను చిక్కుకొని చిన్నారి వేలాడుతూ కనిపించింది.

## మీనాక్షి పిటిషన్ కొట్టివేత

ఫిర్యాదుకు సంబంధించిన విచారణలో మీనాక్షి లిఖితపూర్వక వాంగ్మూలాలు సమర్పించారని, అందువల్ల ఆ కేసు గురించి ఆమెకు అవగాహన ఉందని కూడా రిటర్నింగ్ అధికారి తన ఉత్తర్వులో నమో దు చేశారు. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై మీనా క్షి ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించి లిఖితపూర్వక విజ్ఞాపన కూడా అందజేశారని ధర్మాసనం తెలిపింది. జూన్ 10న ఆమె పూర్తి స్థాయి ఎన్నికల సంఘం ముందు స్వయంగా తన వాదనను వినిపించారని, కానీ ఆమె లేఖపై ఎటువంటి ఉత్తర్వు జారీకాలేదని కోర్టు పేర్కొన్నది. మీనాక్షీ నటరాజన్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదన వినిపిస్తూ వివాదానికి ఆధారమైన ఫిర్యాదు కేసులో ఎటువంటి విషయాన్ని పరిగణనలోకి తీసుకోలేదని, అభియోగాలు కూడా నమోదు చేయలేదని చెప్పారు. కాబట్టి నామినేషన్‌ను తిరస్కరించడం చట్టవిరుద్ధమని వాదించారు. ఎన్నికల ప్రక్రియకు ఆటం కం కలిగించే బదులు సహాయపడే అసాధారణ పరిస్థితుల్లో రాజ్యాంగబద్ధమైన న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చని పేర్కొంటూ మొహిందర్ సింగ్ గిల్, అశోక్‌కుమార్ వంటి తీర్పులను సింఘ్వీ ఉదహరించారు. ఈ అభ్యర్థనను ఎన్నికల సంఘం, ఎన్నికైన అభ్యర్థి, ఇతర ప్రతివాదులు వ్యతిరేకించారు. ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఒక చట్టబద్ధమైన హక్కని, తిరస్కరణకు గురైన అభ్యర్థికి ఎన్నిక ల పిటిషన్ ద్వారా మాత్రమే పరిష్కారం ఉం టుందని వాదించారు.

## అది ఇరాన్ ఘాతుకమే

లీక్ చేసిందని మండిపడ్డారు. ఇదిలా ఉండగా, మూడు నౌకలపై అమెరికా సైన్యం దాడి చేసినట్లు భారత ప్రభుత్వం పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇంతలోనే ట్రంప్ ఇరాన్ వైపు వేలెత్తి చూపడం చర్చనీయాంశంగా మారింది. భారతీయ సిబ్బందితో కూడిన మూడు వాణిజ్య నౌకలపై అమెరికా దాడి చేయడాన్ని అంతకుముందు భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో ముగ్గురు భారతీయులు మృతిచెందడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. ఇలాంటి ప్రాణాంతకమైన, ఘోరమైన దాడులు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, వీటిని ఆపాల్సిందేనని తేల్చిచెప్పింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ భారత్‌లో అమెరికా అత్యున్నత దౌత్యవేత్త(ఛార్జ్ డి అఫైర్స్) జాసన్ మీక్స్‌కు శుక్రవారం సమన్లు జారీ చేసింది. తమ విదేశాంగ శాఖ ప్రధాన కార్యాలయంలో హాజరు కావాలని పేర్కొంది. జాసన్ మీక్స్‌కు సమన్లు జారీ చేయడం ఇది రెండోసారి. నౌకపై భీకర దాడి గురించి తెలిసిన తర్వాత తొలుత బుధవారం రాత్రి సమన్లు ఇచ్చారు. ముగ్గురు మృతిచెందినట్లు నిర్ధారణ కావడంతో మరోసారి సమన్లు జారీ చేశారు. "భారతీయ సిబ్బంది విధి నిర్వహణలో ఉన్న వాణిజ్య నౌకలపై అమెరికా సైన్యం కొనసాగిస్తున్న దాడుల పట్ల జాసన్ మీక్స్‌కు ఇప్పటికే ఒకసారి తీవ్ర నిరసన తెలియజేశాం. ఈ దాడుల్లో ముగ్గురు భారతీయులు మరణించడం బాధాకరం"అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## పెట్టుబడులు పెట్టండి

జే బ్రాండ్లతో ప్రజారోగ్యాన్ని దెబ్బతీశారని, మహిళల మంగళసూత్రాలను తెంచారని ఆరోపించారు. వారంలో సీపీఎస్ రద్దు చేస్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చి.. రద్దు చేయకపోగా వారిని వేధించుకు తిన్నారని గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ అని ఘనంగా ప్రకటించి ఒక్కసారి కూడా నోటిఫికేషన్ జారీ చేయలేదని, అమరావతిపై ఊసరవెల్లి రాజకీయాలు చేశారని.. ఇపుడు మావిగన్ అంటూ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అది మావిగనో లేక వాటికనో అని ఎద్దేవాచేశారు. అమరావతిని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు గత ఎన్నికల్లో ప్రజలు విజ్ఞత ప్రదర్శించారని కొనియాడారు. 57 శాతం ఓటు షేర్‌తో, 90 శాతం సీట్లు ఇచ్చి కూటమిని గెలిపించిన ఘనత వారిదేనన్నారు. పాలనను గాడిలో పెట్టి వారి నమ్మకాన్ని నిలబెట్టుకున్నామన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని, రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారం అందిస్తోందని తెలిపారు. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహ కీలక అంశాల్లో అండగా నిలిచిందన్నారు. ప్రధానమంత్రిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న మోదీని ఈ సందర్భంగా అభినందించారు. సీఎం ఇంకా ఏమన్నారంటే.. రెండేళ్ల కిందట ఇదే రోజు ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి 'ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం.. రాష్ట్రాన్ని కాపాడదాం' అని పిలుపిచ్చాం. దానికి స్పందించిన ప్రజలు కూటమికి ఘన విజయాన్ని కట్టబెట్టారు. 2014లో రాష్ట్రాన్ని విభజన కష్టాలు చుట్టుముట్టాయి. 2019-24 మధ్య వైసీపీ పాలనతో రాష్ట్రంలో విధ్వంసం నెలకొంది. అన్ని రంగాల్లో సంక్షోభం.. వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. వైసీపీ విధ్వంసక పాలన 2019లో ప్రజావేదిక కూల్చివేతతో మొదలై.. రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల అప్పుతో ముగిసింది. నాడు వైసీపీ ప్రభుత్వంపై మూడు పార్టీలూ విడివిడిగా పోరాడాయి. ఎంతో మందిపై కేసులు పెట్టి జైళ్లకు పంపించారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా నన్నూ అరెస్టు చేశారు. 53 రోజులు జైల్లో ఉంచారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా వేధించారు. మేమొచ్చేనాటికి ప్రభుత్వం వద్ద నిధుల్లేవు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్ ఇచ్చి బతికించింది. రెండేళ్లలో ప్రజలకు ఏం చేశామో, ఏమి చేయలేకపోయామో చెప్పడానికి మాతో పాటు మా కార్యకర్తలు కూడా సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నాం. సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నాం. ఎన్టీఆర్ భరోసా కింద అర్హులకు రూ.4 వేల నుంచి రూ.15 వేల దాకా అందిస్తున్నాం. రాష్ట్రంలో 63 లక్షల మందికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నాం. తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ.15 వేల చొప్పున మంజూరు చేస్తున్నాం.

స్త్రీశక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాం. ఇరాన్ యుద్ధంతో ధరలు పెరిగినా దీపం కింద ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో, నేతన్నలకు ఉచిత విద్యుత్, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నాం. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతులకు నగదు చెల్లింపులు చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్యానెళ్లు, బీసీలకు రాయితీపై సౌర విద్యుత్, ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు పీ4 వంటి నూతన ప్రయోగాలు చేపట్టాం. మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు 5757 పోలీసు కానిస్టేబుళ్ల పోస్టులను కూడా భర్తీ చేశాం. ప్రభుత్వ ఉద్యోగులకు 23 నెలల వ్యవధిలో రూ.21 వేల కోట్ల బకాయిలు చెల్లించాం. మా ప్రభుత్వం విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా అన్ని జిల్లాలనూ, 175 నియోజకవర్గాలనూ అభివృద్ధి చేస్తోంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం.

## మీనాక్షి రాజ్యసభ నామినేషన్ వివాదంపై సిట్ విచారణ జరిపించండి: కేటీఆర్ ఎద్దేవా

కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంశానికీ సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందని, అదే విధంగా ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిత్వానికి సంబంధించిన వివాదంపైనా సిట్ విచారణ జరపాలని వ్యంగ్యం ప్రదర్శించారు.మీనాక్షి నటరాజన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లోనే కొందరు నాయకులు వ్యవహరించి ఉండవచ్చని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లింది కూడా కాంగ్రెస్ వర్గాలేనని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత విభేదాలు, వర్గపోరాటాలే ఈ పరిస్థితులకు కారణమని పేర్కొన్నారు. పార్టీ ద్రోహులు ఎవరో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించాలని సూచించారు.తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై కూడా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఉన్న హైదరాబాద్ నగర సమస్యలను పరిష్కరించకుండా భవిష్యత్ నగరాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. తాజాగా కురిసిన వర్షాలతో నగరంలో ఏర్పడిన పరిస్థితులు ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టాయని వ్యాఖ్యానించారు.అలాగే, కేంద్రం తీసుకురానున్న డీలిమిటేషన్ ప్రక్రియపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గేలా నిర్ణయాలు తీసుకుంటే బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఎల్‌నినో ప్రభావం మొదలైంది..!

ప్రస్తుతం కొనసాగుతున్న నైరుతి రుతుపవన కాలంలో ఈ ఎల్‌నినో ప్రభావం మరింత బలపడే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. ఈ మేరకు 2026 జూన్‌కు సంబంధించిన నివేదికను తాజాగా విడుదల చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోవడాన్ని ఎల్‌నినోగా పరిగణిస్తారు. దమధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం ఉపరితల ఉష్ణోగ్రతలు ఎల్‌నినో పరిస్థితులకు అవసరమైన పరిమితిని దాటిపోయినట్లు ఐఎండీ పేర్కొంది. సముద్రం వేడెక్కడంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వస్తున్నాయి. సముద్ర--వాతావరణ అనుసంధాన వ్యవస్థ ఇప్పుడు ఎల్‌నినో స్థితిలో ఉన్నట్లు స్పష్టమవుతోంది. మాన్సూన్ మిషన్ కపుల్డ్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్(ఎంఎంసీఎఫ్ఎఫ్) అంచనాల ప్రకారం.. రుతుపవన కాలం గడుస్తున్న కొద్దీ ఎల్‌నినో తీవ్రతరం అయ్యే అవకాశం ఉంది.

## నీట్ పరీక్షా సమయం పెంపు!

న్యూఢిల్లీ: ఈ నెల 21వ తేదీన జరిగే నీట్ రీటెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) కీలకమైన వెసులుబాట్లు కల్పించింది. పరీక్షా సమయాన్ని పెంచడంతో పాటు బుక్‌లెట్‌లో రఫ్ వర్క్ చేసుకునేందుకు అదనపు పేజీలను కేటాయించింది. గతంలో నీట్ పరీక్ష వ్యవధి 180 నిమిషాలు (3 గంటలు) ఉండేది. తాజా నిర్ణయంతో ఈ సమయాన్ని 195 నిమిషాలకు (3.15 గంటలకు) పెంచింది. పెంచిన సమయం ప్రకారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఇన్విజిలేషన్ ప్రక్రియలో భాగంగా హాజరు పట్టికలో సంతకాలు తీసుకోవడం లాంటివాటితో విద్యార్థులు పరీక్ష సమయాన్ని కోల్పోకుండా ఉండేందుకే అదనంగా 15 నిమిషాల సమయం ఇస్తున్నట్లు ఎన్‌టీఏ వివరించింది. సమయం పెంపుతో పాటే రఫ్ వర్క్ కోసం ఇచ్చే పేజీల సంఖ్యను సైతం ఎన్‌టీఏ రెట్టింపు చేసింది. గతంలో ప్రశ్నాపత్రం బుక్‌లెట్ చివరన కేవలం రెండు పేజీలు మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు వాటి సంఖ్యను నాలుగుకు పెంచారు. భౌతిక శాస్త్రం, రసాయనశాస్త్రం విభాగాల్లో గణాంకాలు, రేఖాచిత్రాల కోసం అభ్యర్థులకు మరింత స్థలం అందుబాటులోకి రానుంది.



## సంగారెడ్డి మైత్రి డ్రగ్స్ ల్యాబ్‌లో ప్రమాదం

### చికిత్స పొందుతూ యువ కార్మికుడు మృతి

### ఘటనపై పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని మైత్రి డ్రగ్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదం విషాదాంతమైంది. పరిశ్రమలోని ల్యాబ్‌లో విధులు నిర్వహిస్తుండగా ప్రమాదానికి గురైన యువ కార్మికుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడిని మెదక్ జిల్లా హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ (25)గా గుర్తించారు. మూడు రోజుల క్రితం మైత్రి డ్రగ్స్ పరిశ్రమలోని ల్యాబ్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదం అనంతరం బాధితుడిని తొలుత సమీపంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. అయితే ఘటన విషయం బయటకు రాకుండా చూసేందుకు యాజమాన్యం ప్రయత్నించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌కుమార్ పరిస్థితి మరింత విషమించడంతో మృతిచెందినట్లు సమాచారం. యువ కార్మికుడి మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ప్రమాదానికి గల కారణాలు, భద్రతా ప్రమాణాల అమలు, పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం వంటి అంశాలపై అధికారులు విచారణ చేపట్టే అవకాశముంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జర్నలిస్టుల ఐక్యతే ధ్యేయం.. గుమ్మడిదల ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

### అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్ట్ యాదగిరి ఎన్నిక

### జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ హామీ



**గుమ్మడిదల, జూన్ 12 ( నేటి ప్రస్థానం ):** గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో గుమ్మడిదల ప్రెస్ క్లబ్ నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కమిటీ పనిచేయనున్నట్లు సభ్యులు తెలిపారు. నూతన కమిటీలో అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్ట్ యాదగిరి, ఉపాధ్యక్షులుగా జీవరత్నం, నాగేష్ చారి, ప్రధాన కార్యదర్శిగా నరేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా నీరుడి రాజు, కోశాధికారిగా భాను చందర్ ఎన్నికయ్యారు. అలాగే గౌరవ సలహాదారులు, కార్యవర్గ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యత, హక్కుల పరిరక్షణ, సంక్షేమమే తమ కమిటీ ప్రధాన లక్ష్యమని అన్నారు. గుమ్మడిదల ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సభ్యులందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ప్రెస్ క్లబ్‌ను మరింత బలోపేతం చేసి జర్నలిస్టుల సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టడంలో నూతన కమిటీ కట్టుబడి పనిచేస్తుందని సభ్యులు పేర్కొన్నారు. నూతన కమిటీ ఎన్నికపై పలువురు జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కులకర్ణి రవీందర్, ఆనంద్, శేఖర్, రవీందర్ చారి, నాయుడు తదితరులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

## గంజాయితో పట్టుబడ్డ మోడల్ మిస్ హర్ష సన్నీ

### బ్యాంకాక్ నుంచి ముంబై రాగా పట్టివేత

ముంబై:మోడలింగ్ రంగంలో రాణిస్తూ.. కేరళ అందాల పోటీల్లో పాల్గొన్న ఓ యువతి, ఒక్క రాత్రిలో డ్రగ్స్ స్మగ్లర్‌గా మారి జైలుపాలైంది. బ్యాంకాక్ నుంచి ముంబైకి రూ.11.82 కోట్ల విలువైన హై-క్వాలిటీ 'హైడ్రోపోనిక్ గంజాయి'ని స్మగ్లింగ్ చేస్తూ.. మాజీ 'మిసెస్ కేరళ' కంటెస్టెంట్ హర్ష సన్నీ (28) ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులకు అడ్డంగా దొరికిపోయింది. ఎయిర్ ఇండియా విమానం ద్వారా బ్యాంకాక్ నుంచి ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి హర్ష సన్నీ చేరుకుంది. లగేజీ క్లియరెన్స్ సమయంలో ఆమె ప్రవర్తన కాస్త అనుమానాస్పదంగా ఉండటాన్ని ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్, కస్టమ్స్ అధికారులు గమనించారు. ఆమెను పక్కకు పిలిచి, ఆమె వద్ద ఉన్న ట్రావెల్ బ్యాగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆ బ్యాగులో ప్యాక్ చేసిన 12 ప్లాస్టిక్ ప్యాకెట్లు కనిపించాయి. వాటిలో పచ్చటి పదార్థం ఉంది. వెంటనే అధికారులు 'ఎన్‌డిపిఎస్' కిట్‌తో కెమికల్ టెస్ట్ చేయగా, అది అత్యంత ఖరీదైన, నాణ్యమైన 'హైడ్రోపోనిక్ మారిజువానా' (గంజాయి) అని తేలింది. సాధారణ గంజాయితో పోలిస్తే ల్యాబ్‌లలో నియంత్రిత వాతావరణంలో పెంచే ఈ హైడ్రోపోనిక్ గంజాయికి మార్కెట్లో విపరీతమైన డిమాండ్, ధర ఉంటుంది.

# ఈగల్ ఆపరేషన్.. గంజాయి డాన్ పరార్

### నానక్‌రామ్‌గూడలో భారీ దాడులు.. 47 మంది వినియోగదారులు పట్టుబాటు

### 20 మంది ఐటీ ఉద్యోగులు ఉండటంతో పోలీసులే విస్మయం

**హైదరాబాద్:** గంజాయి అక్రమ వ్యాపారంలో కరుడుగట్టిన నిందితురాలిగా పేరుగాంచిన నీతుబాయ్‌ను పట్టుకునేందుకు ఈగల్ ఫోర్స్ చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్ విఫలమైంది. బుధవారం నానక్‌రామ్‌గూడలో ఆమె నివాసంపై అధికారులు భారీ స్థాయిలో దాడులు నిర్వహించినప్పటికీ, సమాచారం ముందుగానే తెలుసుకున్న నీతుబాయ్ అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. అయితే దాడుల సమయంలో నీతుబాయ్ ఇంటి వద్ద గంజాయి కొనుగోలు చేసేందుకు మొత్తం 47 మంది వినియోగదారులు క్యూలో నిలబడి ఉండటం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. వీరిలో సుమారు 20 మంది ఐటీ ఉద్యోగులు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం.

**ధూల్‌పేట నుంచి నానక్‌రామ్‌గూడకు మకాం**

ధూల్‌పేట ప్రాంతానికి చెందిన నీతుబాయ్ స్థానికంగా పోలీసుల నిఘా పెరగడంతో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నానక్‌రామ్‌గూడకు మకాం మార్చింది. కిరాణా దుకాణం ముసుగులో కుటుంబ సభ్యులతో కలిసి గంజాయి విక్రయాలు కొనసాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నీతుబాయ్‌పై 2017 నుంచి 2024 వరకు ఎన్డీపీఎస్ చట్టం, ఎక్సైజ్ చట్టాల కింద దాదాపు 20 కేసులు నమోదయ్యాయి. పలుమార్లు అరెస్టై జైలు శిక్ష అనుభవించినప్పటికీ అక్రమ వ్యాపారాన్ని మాత్రం కొనసాగించినట్లు అధికారులు వెల్లడించారు.

**కోట్ల రూపాయల ఆస్తుల జప్తు**

2023లో నమోదైన భారీ గంజాయి కేసులో




భాగంగా నీతుబాయ్‌కు చెందిన అక్రమ ఆస్తులను అధికారులు గుర్తించారు. దాదాపు రూ.40.30 లక్షల నగదు, రూ.1.53 కోట్ల డిపాజిట్లు ఉన్న 16 బ్యాంకు ఖాతాలు, సుమారు రూ.2 కోట్ల విలువైన స్థిరాస్తులను ఎన్డీపీఎస్ చట్టం కింద జప్తు చేశారు. అయినప్పటికీ జైలు నుంచి విడుదలైన అనంతరం తిరిగి గంజాయి విక్రయాలను ప్రారంభించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

**గతంలోనూ భారీ స్వాధీనం**

2024 మార్చి 13న అప్పటి తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (ప్రస్తుతం ఈగల్ ఫోర్స్) అధికారులు గచ్చిబౌలి పోలీసులతో కలిసి నీతుబాయ్ ఇంటిపై దాడి నిర్వహించారు. ఆ సమయంలో 22.6 కిలోల గంజాయి, రూ.22.10 లక్షల నగదు, రెండు మొబైల్ ఫోన్లు, ఒక ఫోన్‌పే స్కానర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ దాడి సందర్భంగా ఇంటి బయట గంజాయి కొనుగోలు చేసేందుకు సుమారు 30 మంది వినియోగదారులు క్యూలో నిలబడటం అప్పట్లో సంచలనంగా మారింది. 1970-80 దశకాల్లో రేషన్ దుకాణాల వద్ద కనిపించే క్యూలను తలపించేలా పరిస్థితి ఉందని అధికారులు వ్యాఖ్యానించారు.

### పీడీ యాక్ట్ అమలు.. కోర్టులో రద్దు

నీతుబాయ్ నిరంతరం నేరాలకు పాల్పడుతుండటంతో 2024 జూన్ 12న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆమెపై ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్ట్‌ను ప్రయోగించారు. డ్రగ్ ఆఫెండర్‌గా గుర్తించి ఆమెను చంచల్‌గూడ మహిళా ప్రత్యేక జైలుకు తరలించారు. అయితే 2024 అక్టోబర్ 17న తెలంగాణ హైకోర్టు పీడీ ఉత్తర్వులను రద్దు చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, సుప్రీంకోర్టు కూడా హైకోర్టు నిర్ణయాన్ని సమర్థిస్తూ ప్రత్యేక అనుమతి పిటిషన్‌ను కొట్టివేసింది. ప్రస్తుతం పరారీలో ఉన్న నీతుబాయ్ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఈగల్ ఫోర్స్ అధికారులు వెల్లడించారు.

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్

# రాజ్యసభ నామినేషన్ వివాదం

న్యూఢిల్లీ/హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వివాదం చుట్టూ కొత్త రాజకీయ చర్చ మొదలైంది. ఆమె నామినేషన్ తిరస్కరణ వెనుక పక్కా ప్రణాళికతో కూడిన అంతర్గత కుట్ర జరిగిందన్న ఆరోపణలు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారంపై పార్టీ అధిష్టానం చేపట్టిన అంతర్గత పరిశీలనలో కొన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ వర్గాల కథనం ప్రకారం, తెలంగాణ కాంగ్రెస్‌లోని కొందరు ప్రభావశీల నాయకులు మరియు వారి సన్నిహిత వర్గాలు మీనాక్షి నటరాజన్ రాజకీయ ప్రాధాన్యాన్ని తగ్గించే లక్ష్యంతో వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ఆమె నామినేషన్‌కు సంబంధించిన న్యాయపరమైన అంశాలు ప్రత్యర్థుల చేతికి చేరడం వెనుక అంతర్గత లీకులు ఉన్నాయా అనే కోణంలో విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

**ఎమ్మెల్సీ నుంచి వర్కింగ్ ప్రెసిడెంట్ వరకు...**

కాంగ్రెస్‌లోని ఒక కీలక నాయకుడి సన్నిహితుడికి పార్టీ పదవులు ఇప్పించేందుకు గతంలో పలు ప్రయత్నాలు జరిగినప్పటికీ, వాటికి మీనాక్షి నటరాజన్ అడ్డుపడినట్లు పార్టీ వర్గాల్లో చర్చ ఉంది. ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి వంటి అంశాల్లో ఆమె పాత్ర కారణంగా కొందరిలో అసంతృప్తి పెరిగిందని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే రాజ్యసభ ఎన్నికల సమయంలో ప్రతీకార రాజకీయాలు చోటుచేసుకున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మీనాక్షి రాజ్యసభకు ఎన్నికైతే పార్టీ కేంద్ర నాయకత్వంలో ఆమె ప్రభావం మరింత పెరుగుతుందనే అభిప్రాయంతో కొందరు వ్యూహరచన చేసినట్లు సమాచారం.



### లీగల్ సెల్ పాత్రపై ప్రశ్నలు

సాధారణంగా రాజ్యసభ నామినేషన్ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ పూర్తిస్థాయిలో వ్యవహరిస్తుంది. అయితే మీనాక్షి నటరాజన్ నామినేషన్ విషయంలో రాష్ట్ర లీగల్ సెల్ ఎందుకు చురుకుగా వ్యవహరించలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, నామినేషన్ ప్రక్రియను మధ్యప్రదేశ్ నాయకత్వం చూసుకుంటుందని చెప్పడంతో తెలంగాణ లీగల్ సెల్ ప్రత్యక్షంగా జోక్యం చేసుకోలేదని తెలుస్తోంది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ప్రత్యర్థులు ముందస్తు వ్యూహం అమలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

**కోర్టు సమన్ల లీక్‌పై అనుమానాలు**

మధ్యప్రదేశ్‌లో నమోదైన ఒక కేసుకు సంబంధించిన కోర్టు సమన్లు ప్రత్యర్థుల చేతికి ఎలా చేరాయన్నది ప్రస్తుతం ప్రధాన చర్చగా మారింది. కాంగ్రెస్ అంతర్గత వర్గాల సమాచారం ప్రకారం, ఈ పత్రాలు తెలంగాణ నుంచి బయటకు వెళ్లి మహారాష్ట్ర మీదుగా మధ్యప్రదేశ్ బీజేపీ నాయకుల వద్దకు చేరినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మధ్యప్రదేశ్ మంత్రి కైలాశ్ విజయ్‌వర్గీయ ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా ఈ చర్చకు మరింత ఊతమిచ్చాయి. “పత్రాలు కాంగ్రెస్ వర్గాల నుంచే బయటకు వచ్చి ఉండొచ్చు” అని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**మహారాష్ట్ర లింక్?**

ఈ వ్యవహారంలో మహారాష్ట్రకు చెందిన ఓ ప్రముఖ రాజకీయ నేత పాత్రపై కూడా కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. కోర్టు సమన్లు, కేసు పత్రాలు ముందుగా మహారాష్ట్రకు చేరి, అక్కడి నుంచి న్యాయపరమైన వ్యూహాలు రూపొందించబడ్డాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. న్యాయ నిపుణుల సలహాలతో అభ్యంతర పత్రాలు సిద్ధం చేసి, అవసరమైతే ప్రత్యామ్నాయ వ్యూహాన్ని అమలు చేసేలా ప్రణాళిక రూపొందించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ కారణంగానే బీజేపీ చివరి దశలో అదనపు అభ్యర్థిని రంగంలోకి దింపిందనే వాదన కూడా వినిపిస్తోంది.

**ఏఐసీసీ విచారణలో అసలు నిజాలు?**

మీనాక్షి నటరాజన్ నామినేషన్ వివాదం యాదృచ్ఛికంగా జరిగిందా? లేక పక్కా రాజకీయ వ్యూహంలో భాగమా? అన్న దానిపై కాంగ్రెస్ అధిష్టానం అంతర్గతంగా విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నివేదిక విడుదల కాలేదు. ఈ వ్యవహారంపై సంబంధిత నాయకుల నుంచి కూడా అధికారిక స్పందన రావాల్సి ఉంది. విచారణ పూర్తయిన తర్వాతే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

## తిరుగుబాటు ఎంపిల కొత్త ఎత్తుగడ

### తమదే అసలైన టిఎంసిగా వాదన

### స్పీకర్ ఓంబిర్లాను కలిసి వివరించేందకు సన్నద్ధం

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ లో తలెత్తిన సంక్షోభం పతాక స్థాయికి చేరుతున్నాయి. తమదే అసలైన టిఎంసి అని తిరుగుబాటు దారులు ప్రకటించే సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీ అధినాయకత్వంపై అసంతృప్తితో రగులుతున్న తిరుగుబాటు ఎంపీలు తమదే 'నిజమైన టీఎంసీ' పార్లమెంటరీ గ్రూప్ అని క్లెయిమ్ చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలుసుకోనున్నారు. ఈ విషయాన్ని రెబల్ ఎంపీ జగదీష్ చంద్ర బర్మా బసునియా ధృవీకరించారు. ఇప్పటికే తమ గ్రూపు స్పీకర్‌కు ఒక రిప్రజెంటేషన్ సమర్పించిందని, తమను 'రియల్ టీఎంసీ' పార్లమెంటు గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు ఈనెల 15న మరోసారి కలుసుకోనున్నామని రెబల్ ఎంపీ జగదీష్ చంద్ర బర్మా బసునియా తెలిపారు. ప్రత్యేక పార్లమెంటరీ గ్రూపు ఏర్పాటుకు, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకు మద్దతించేందుకు రెబల్ ఎంపీలు పట్టుదలగా ఉండగా, వారికి మద్దతిస్తున్న వారిలో బసునియా ఉన్నారు. ఆయన కూచ్ బెహర్ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పార్టీ ఎంపీలను ఫిరాయింపులకు కొందరు ప్రోత్సహిస్తున్నారంటూ టీఎంసీ ఎంపీ కీర్తి అజాద్ చేసిన ఆరోపణలను బసునియా తోసిపుచ్చారు. ఆయన అబద్ధలాకోరు అనీ, ఆ విధంగా చెప్పడం సరికాదని అన్నారు. తాము 19 మంది ఎంపీలమనీ, ఆయన కూడా ఒక ఎంపీయేనని, ఇలాంటి ఆరోపణలు చేయడం మంచిదికాదని చెప్పారు. తిరుగుబాటు ఎంపీలకు కకోలీ ఘోష్ దస్తిదార్ నాయకత్వం వహిస్తున్నారు. లోక్‌సభలోని 20 మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్టుగా ఆమె ఇటీవల ప్రకటించారు. ఈ గ్రూపులో శతాబ్దీ రాయ్, యూసుఫ్ పఠాన్, సయోనీ ఘోష్, శత్రుఘ్నసిన్హా .

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



# దాదిగూడెంలో అక్రమ మైనింగ్ తవ్వకాలపై గ్రామస్తుల ఆందోళన

**సర్వే నంబర్ 829లో కంకర క్రషర్ ఏర్పాటును నిలిపివేయాలని ఎమ్మార్వోకు ఫిర్యాదు**



**జిన్నారం, జూన్ 12 ( నేటి ప్రస్థానం ):** జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని దాదిగూడెం గ్రామ శివారులో ఉన్న సర్వే నంబర్ 829లో నూతనంగా చేపడుతున్న అక్రమ మైనింగ్ తవ్వకాలు, కంకర క్రషర్ ఏర్పాటు ప్రయత్నాలపై గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పర్యావరణం, భూగర్భ జలాలు, వ్యవసాయ భూములకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంటూ గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో కంకర క్రషర్ ఏర్పాటును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని కోరుతూ గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అక్రమ మైనింగ్ కార్యకలాపాలు కొనసాగితే గ్రామ ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదుపై స్పందించిన ఎమ్మార్వో, సంబంధిత అంశంపై సమగ్ర విచారణ నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా కంకర క్రషర్ ఏర్పాటు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గంగు రమేష్, మాజీ సర్పంచ్ కొరివి ఆంజనేయులు, మాజీ వార్డు సభ్యులు, ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పండి: టీజీపీసీబీ అవగాహన సదస్సు

**గుడ్డ, జనపనార సంచుల వినియోగాన్ని ప్రోత్సహించాలి పర్యావరణ ఇంజనీర్ బి. రాజేందర్**





మేడ్చల్, జూన్ 12(నేటి ప్రస్థానం): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ప్రాంతీయ కార్యాలయం, మేడ్చల్ ఆధ్వర్యంలో జీడిమెట్లలో అవగాహన సదస్సు నిర్వహించారు. "సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పండి -- గుడ్డ మరియు జనపనార సంచుల వినియోగాన్ని ప్రోత్సహించండి" అనే అంశంపై జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యాపారులు, దుకాణదారులు, ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు మరియు ఇతర భాగస్వాములు పాల్గొన్నారు. సదస్సులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలు, వాటికి ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత ఉత్పత్తుల వినియోగం, పునర్వినియోగం, పునఃచక్రీకరణ, పునరుద్ధరణ వంటి సుస్థిర విధానాలపై అవగాహన కల్పించారు. సహజ వనరుల సంరక్షణతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు ఈ చర్యలు ఎంతగానో దోహదపడతాయని అధికారులు వివరించారు. అలాగే వాయు, నేల, జల కాలుష్య సమస్యలు మరియు వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన స్టాల్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను, ఘన వ్యర్థాల నిర్వహణ నియమాల ప్రకారం నాలుగు రంగుల చెత్త సేకరణ బిన్ల వినియోగ విధానాన్ని ప్రదర్శించారు. ప్రదర్శనలను ఆసక్తిగా పరిశీలించిన పాల్గొనేవారు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాల అవసరం, వాటి ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణలో వాటి ప్రాధాన్యత, వ్యర్థాల వర్గీకరణ పద్ధతులపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమం ముగింపులో హాజరైన ప్రతి ఒక్కరికీ జనపనార సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది పాల్గొనగా, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పర్యావరణ ఇంజనీర్, 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక నోడల్ అధికారి బి. రాజేందర్ పిలుపునిచ్చారు.




# ప్రభుత్వ విద్యతోనే ఉన్నత శిఖరాలు అందుకోవాలి

**విద్యార్థినులకు పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**

**ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులోకి వస్తోందని వ్యాఖ్య**









**పటాన్చెరు, జూన్ 12 ( నేటి ప్రస్థానం ):** ప్రభుత్వ విద్యాసంస్థలు నాణ్యమైన విద్యకు చిరునామాగా మారాయని, విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశలను నెరవేర్చేలా ఇష్టపడి చదివి జీవిత లక్ష్యాలను సాధించాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం కళాశాల తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ఆధునిక ఇంటరాక్టివ్ డిజిటల్ ప్యానెల్స్‌ను ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ కళాశాలల్లో ఆధునిక సదుపాయాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ప్రతి ఏడాది అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. పటాన్చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం అవసరమైన సహకారాన్ని నిరంతరం అందిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వంగరి అశోక్, అధ్యాపక బృందం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.75 కోట్ల పనులపై జాప్యం సహించం.. ఎమ్మెల్యే జీఎంఆర్

**పనులు చేపట్టని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్ చేయాలని ఆదేశం**

**ఐదు మున్సిపాలిటీల అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష -- జాప్యానికి తావులేదన్న జీఎంఆర్**





**పటాన్చెరు, జూన్ 12 ( నేటి ప్రస్థానం ):** పటాన్చెరు నియోజకవర్గంలో అభివృద్ధి పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రజలకు ఇచ్చిన హామీలను గడువులోగా పూర్తి చేయడం అధికారుల, కాంట్రాక్టర్ల బాధ్యత అని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. టెండర్లు పొంది కూడా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారిని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చి తిరిగి టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో ఇస్నాపూర్, ఇంద్రేశం, గడ్డపోతారం, జిన్నారం, గుమ్మడిదల మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల ఐదు మున్సిపాలిటీల్లో శంకుస్థాపన చేసిన సుమారు రూ.75 కోట్ల అభివృద్ధి పనుల పురోగతిని సమగ్రంగా పరిశీలించారు. గత నెలలో ఒక్కో మున్సిపాలిటీలో రూ.15 కోట్ల చొప్పున చేపట్టిన అభివృద్ధి పనుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల మున్సిపాలిటీల పరిధిలో సుమారు 50 శాతం పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని అధికారులు వివరించారు. ఇప్పటికే ప్రారంభమైన పనులను వేగవంతం చేయడంతో పాటు మిగిలిన పనులను కూడా ఆలస్యం లేకుండా ప్రారంభించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. జిన్నారం మున్సిపాలిటీలో టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించకపోవడంతో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, కమిషనర్ నాగేందర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ప్రజల అభివృద్ధికి ఆటంకం కలిగించే వారిపై ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. పనులు చేపట్టని కాంట్రాక్టర్లను వెంటనే బ్లాక్‌లిస్ట్‌లో చేర్చి, అవసరమైతే రీ-టెండర్లు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో 15 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయని, వచ్చే వారంలో అన్ని పనులు ప్రారంభమవుతాయని కమిషనర్ తాన్య వివరించారు. అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం సహించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ పనుల నాణ్యత, పురోగతిని పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేసినప్పుడే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మున్సిపల్ పాలకవర్గ సభ్యులు అధికారులతో కలిసి వార్డుల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఇస్నాపూర్ డంపింగ్ యార్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. మున్సిపల్ పరిధిలో 10 ఎకరాల స్థలంలో అత్యాధునిక బయో మైనింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు అమల్లోకి వస్తే వ్యర్థాల నిర్వహణ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని చెప్పారు. అదేవిధంగా ప్రతి మున్సిపాలిటీలో రూ.10 కోట్ల వ్యయంతో ఆధునిక ఫంక్షన్ హాళ్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు అందించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని ఆయా మున్సిపల్ పాలకవర్గాలకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, చేపట్టిన ప్రతి అభివృద్ధి పని ప్రజలకు ఉపయోగపడేలా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి కావాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్లు సుమలత, ప్రమీల, సుష్మ, కుమార్ గౌడ్, జనార్ధన్, వైస్ చైర్మన్లు సంధ్య గోవర్ధన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మహేందర్ గౌడ్, కమిషనర్లు వెంకట కిషన్, అజయ్ రెడ్డి, తాన్య, దశరథ్, నరేందర్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/




## గంగ వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు వెంటనే ప్రారంభించాలి: బీజేపీ డిమాండ్

### తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పణ

మేడ్చల్, జూన్ 12:(నేటి ప్రస్థానం) మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గంగ వెంచర్‌లో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకురాలు జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ, గంగ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన అనేక మంది కుటుంబాలు రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేమ దాసు, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, కార్యదర్శి బండి విష్ణు, సీనియర్ నాయకులు ధాత్రిక లక్ష్మణ్ వంజరి, మహిళా నాయకులు తోట అనిత, అనిత, నాయకులు బొజ్జ వంశీ రెడ్డి, జకట బాబు రాజు, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, మహేష్ గౌలికర్, పురుషోత్తం, మల్లికార్జున్, ఎన్.ఎస్. గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని, గంగ వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ వ్యవహారాన్ని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

## పాడుబడిన ప్రభుత్వ భవనాలు.. ప్రజలకు ప్రమాద ఘంటికలు నాచారం విజయలక్ష్మి

### "మేడ్చల్‌లో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు


### అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్న వైనం





**మేడ్చల్, జూన్ 12(నేటి ప్రస్థానం):-** ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం, సంబంధిత శాఖల ఉదాసీనత కారణంగా మేడ్చల్ పట్టణంలోని పలు ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకుని ప్రజలకు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఒకప్పుడు విద్యార్థుల చదువులకు కేంద్రంగా నిలిచిన ప్రభుత్వ పాఠశాల భవనాలు నేడు పాడుబడి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలోని పాడుబడిన ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలను పరిశీలించారు. జిల్లా అధ్యక్షురాలు నాచారం విజయలక్ష్మి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

మేడ్చల్ పట్టణంలోని అర్జున్‌వాడ ప్రాంతంలో రథంశాల సమీపంలో, అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా ఉన్న పాడుబడిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రతినిధులు సందర్శించారు. ఈ భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని స్థానికులకు ఇబ్బందిగా మారిందని వారు పేర్కొన్నారు. మాజీ వార్డు సభ్యుడు గల్వ మహేష్ మాట్లాడుతూ, ఇళ్ల మధ్యలో ఉన్న ఈ భవనం రాత్రి వేళల్లో అసాంఘిక శక్తులకు నిలయంగా మారిందని ఆరోపించారు. చిన్నారులు, మహిళలు సంచరించే ప్రాంతంలో ఇలాంటి శిథిల భవనం ఉండటం ప్రజల భద్రతకు ముప్పుగా మారిందన్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ప్రాంతంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపులు కూడా ప్రజలకు మరో సమస్యగా మారాయని గల్వ మహేష్ తెలిపారు. బెల్ట్ షాపుల వల్ల యువత చెడు అలవాట్లకు బానిసలవుతుండటంతో పాటు శాంతిభద్రతలకు భంగం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ గుప్తా మాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. పాడుబడిన ప్రభుత్వ భవనాలను వెంటనే తొలగించడం లేదా ప్రజా అవసరాలకు అనుగుణంగా పునర్వినియోగం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులు నిర్లక్ష్యానికి గురికావడం బాధాకరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదకరంగా మారిన భవనాలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకుని ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు భరోసా కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ గుప్తా, జిల్లా అధ్యక్షురాలు నాచారం విజయలక్ష్మి, ఎం. లావణ్య, మేడ్చల్ విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, నర్సింహులు పటేల్, మాజీ వార్డు సభ్యుడు గల్వ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# మైత్రి డ్రగ్స్ కార్మికుడి మృతికి న్యాయం..

### సీఐటీయూ పోరాటంతో రూ.80 లక్షల పరిహారం

### బాధిత కుటుంబానికి ఉద్యోగ హామీ.. యాజమాన్యంతో చర్చలు సఫలం

### కార్మికుడి మృతి ఘటనపై స్పందించిన సీఐటీయూ నేతలు

### -- చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని డిమాండ్







**గుమ్మడిదల, జూన్ 12 (నేటి ప్రస్థానం ):** గుమ్మడిదల పారిశ్రామిక ప్రాంతంలోని మైత్రి డ్రగ్స్ టెక్నాలజీ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు ప్రవీణ్ కుమార్ మృతి చెందిన ఘటన విషాదాన్ని మిగిల్చింది. అయితే బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా సీఐటీయూ చొరవ తీసుకుని పరిశ్రమ యాజమాన్యంతో జరిపిన చర్చలు సఫలమవడంతో రూ.80 లక్షల నష్టపరిహారం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కే.రాజయ్య వెల్లడించారు. సీఐటీయూ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా హత్నూర మండలం కసాల గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ (25) మైత్రి డ్రగ్స్ పరిశ్రమలో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. సుమారు వారం రోజుల క్రితం రెండో షిఫ్ట్‌లో విధులు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే పరిశ్రమ యాజమాన్యం అతడిని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారు. ఎనిమిది రోజుల పాటు చికిత్స పొందినప్పటికీ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడక శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. ప్రవీణ్ కుమార్ మృతి అనంతరం కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురవడంతో పాటు తమకు న్యాయం చేయాలని సీఐటీయూను ఆశ్రయించినట్లు రాజయ్య తెలిపారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యుల సమక్షంలో నిమ్స్ ఆస్పత్రి వద్ద పరిశ్రమ ప్రతినిధులతో చర్చలు నిర్వహించామని చెప్పారు. బాధిత కుటుంబ పరిస్థితిని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి, తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. చర్చల అనంతరం బాధిత కుటుంబానికి రూ.80 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. అలాగే చట్టప్రకారం రావాల్సిన ఇతర ప్రయోజనాలను కూడా అందించేందుకు హామీ ఇచ్చిందన్నారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా రూ.1 లక్షను కుటుంబ సభ్యులకు అందజేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రత, ఆరోగ్యం విషయంలో యాజమాన్యాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే సంబంధిత శాఖలకు సమాచారం ఇవ్వడంతో పాటు కుటుంబ సభ్యులకు పూర్తి వివరాలు తెలియజేయాలని సూచించారు. కార్మికుల ప్రాణాలు, హక్కుల విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉందని, సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని కార్మిక సంఘాల నేతలు, స్థానికులు డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలు, కార్మిక సంక్షేమ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. చర్చల్లో పరిశ్రమ ప్రతినిధులు ఎన్.శ్రీనివాసరావు, రాంప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొనగా, బాధిత కుటుంబ సభ్యులు, సీఐటీయూ నాయకులు హాజరయ్యారు.

# మేడ్చల్ కలెక్టరేట్ ముట్టడితో ఉద్రిక్తత

### పాఠశాల విద్యలో సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ డిమాండ్

మేడ్చల్, జూన్ 12(నేటి ప్రస్థానం ): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తూ విద్యా రంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ విద్యార్థి నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్యామ్ కిరణ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు 12 సంవత్సరాలు గడిచినా పాఠశాల విద్యా వ్యవస్థలో అనేక సమస్యలు కొనసాగుతున్నాయని విమర్శించారు. రేషనలైజేషన్ పేరుతో వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని, అనేక పాఠశాలలు ఇప్పటికీ ఏకోపాధ్యాయ పాఠశాలలుగానే కొనసాగుతున్నాయని ఆరోపించారు. (ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, తరగతి గదులు వంటి కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ విద్యార్థులకు యూనిఫార్ములు, పాఠ్యపుస్తకాలు అందకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని, కొందరు విద్యాసంస్థలు 'ఇంటర్నేషనల్ స్కూల్స్' పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రతి ఏడాది ఫీజులను భారీగా పెంచుతూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో డీఈవోలు, ఎంఈవోల కొరత కారణంగా విద్యా వ్యవస్థ పర్యవేక్షణ దెబ్బతింటోందని, అనేక మండలాల్లో ఇన్‌చార్జి ఎంఈవోలతోనే వ్యవహారాలు నడుస్తున్నాయని తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకుల పాఠశాలలు కొన్ని ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, విద్యార్థుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు. ఏబీవీపీ ప్రధాన డిమాండ్లు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను వెంటనే కల్పించాలి. ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకువచ్చి ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి. డీఈవో, ఎంఈవో పోస్టులను పూర్తి స్థాయిలో భర్తీ చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు చేపట్టాలి. గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలి. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ నగేష్, ఎస్‌డబ్ల్యూసీ సభ్యులు అఖిల్, జిల్లా కన్వీనర్లు మృతుంజయ్, బాలు, భరత్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు. విద్యా వ్యవస్థలో లోపాలపై ఏబీవీపీ గళమెత్తిందిమేడ్చల్‌లో జరిగిన ఈ ఆందోళన ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఏబీవీపీ ప్రయత్నించింది. విద్యార్థులకు నాణ్యమైన విద్య, తగిన మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్‌తో చేపట్టిన ఈ ముట్టడి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.



# ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ వివక్ష

### హెల్త్ కార్డులు ఇవ్వకుండా రాజకీయం

### మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాసగౌడ్

హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఉద్యోగులకు తక్కువ చేసి చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి .దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్ల తెలంగాణలో 10 నుంచి 15 లక్షల కుటుంబాల ఉద్యోగులు, పెన్షన్ దారులు ఆందోళనలో ఉన్నారని ఆరోపించారు. హెల్త్ కార్డ్స్ ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర యేండ్లలో ఇంతవరకు ఉద్యోగులకు, పెన్షన్ దారులకు హెల్త్ కార్డ్స్ ఇవ్వలేదని ఆరోపించారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు సకాలంలో జీతాలు రావడం లేదని అన్నారు. హెల్త్ కార్డ్స్ ఇష్యూపై కమిటీ వేశారే తప్పా హెల్త్ కార్డ్స్ మాత్రం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కమిటీ ముఖ్యమంత్రి మాట వినడం లేదా? ముఖ్యమంత్రి మాట కమిటీ వినడం లేదా అర్థం కావడం లేదని విమర్శించారు. పీఆర్‌సీ 6 నెలల్లో క్లియర్ చేస్తామని చెప్పి ఇంతవరకు ఆ ఊసే లేదని అన్నారు. బీఆర్ఎస్ హయంలో ఉద్యోగులను కాపాడుకున్నా మని వెల్లడించారు. ఒక్కో ఉద్యోగి నుంచి నెలకు 2 వేల నుంచి 3 వేల వరకు డబ్బులు కట్ అవుతున్నాయి. ఉద్యోగి జీతం నుంచి డబ్బులు కట్ చేయమని ఈ ప్రభుత్వానికి చెప్పింది ఎవరని ప్రశ్నించారు. ఉద్యోగులను తక్కువ చేసి చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆరోగ్యం విషయంలో ఉద్యోగులు చనిపోతే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జూన్ 1 నుంచి హెల్త్ కార్డ్స్ ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని విమర్శించారు. హెల్త్ కార్డ్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తుందని దేవి ప్రసాద్ అన్నారు. ద్యోగి సమ్మతి లేకుండా జీతం కట్ చేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వినిపించుకోవడం లేదని తెలిపారు. కేసీఆర్ పరిపాలనలో అంగన్‌వాడీ వర్కర్స్ కు ఏ రాష్ట్రంలో లేని విధంగా జీతాలు ఇచ్చారని గుర్తు చేశారు.